# సహనం చస్తే....

* రచన : శ్రీ హెచ్. రమేష్‌బాబు *



(రచయిత)

సమయం సరిగ్గా ఉదయం తొమ్మిదింపావు! నీళ్ళబిందెతో ఇంట్లోకొస్తున్న కావేరికెదురుగా ఎనిమిదేళ్ళ సూరిగాడు చిన్నగా డుస్తూ వచ్చి 'అమ్మా! చూడవే రాజీనా అన్నం తిననీకుండా లాక్కుంది' అంటూ ఫిర్యాదు చేశాడు. 'ఏది మాట్లాడవద' మంటూ వాణ్ణి కుడిచేతో పట్టుకుని వంటింట్లోకి నడిచింది. మూడేళ్ళ రాజి కంచంలో ఉన్న అన్నం తింటోంది. నిజానికి అన్నం ఆ పసిదానిక్కూడా సరిపోదు. కాని సూరిగాడా అన్నం తింటేగాని స్కూలు కెళ్ళగలుగుతాడు. బిందెను కిందికి దించి రాజి దగ్గరకెళ్ళి—

'రాజి ఈ అన్నం అన్నయకిచ్చేయ్' అంది కావేరి. "ఊహు" అంటూ తల అడ్డంగా తిప్పింది. ఆ అన్నాన్ని సూరిగాడికిప్పించాలని సముదాయించేసరికి కావేరి తల ప్రాణం తోకొచ్చింది. అది రాత్రి తన కడుపునిండా తినక మిగిల్చింది కావేరి. ఉదయం సూరిగాడు తిని స్కూలుకెళతాడన్న ఆలోచనతో. మళ్ళీ ఈ ఉదయం దాని కోసం ఇద్దరి పోట్లాట. అవును వారికేం తెలుసు. ఆకలనడమేసరి ఏదో ఒకటి కావాలని తినాలని ఆర్భాటపడే అమాయకులు. ఉన్నదీ, లేనిదీ ఆలోచించలేని పసితనం !

'అమ్మా నేను స్కూలు కెళుతున్నాను' సూరి పిలుపుకు ఆలోచనలోంచి తేరుకుని 'ఆఁ! వెళ్ళు జాగ్రత్త! రోడ్డు పక్కగా చూసి నడు" అంటూ తలుపుదాక వాడితోవెళ్ళి వెనక్కి మళ్ళింది. ఎదురుగా దీనవదనంతో రాజి దాని చూపుల్లో నిరాశ. అమాయకత్వం బయటికి చెప్పలేని భావాలు కనబడుతున్నాయి. కావేరి మనసంతా ఆదోళన అయింది. "పాపిష్టి దాన్ని దాని నోటిముందు కూటిని లాగేశాను. పాపం పసి మనసెంత బాధపడిందో" బాధతో ముందుకెళ్ళి ''ఏమ్మా ఆకలిగా ఉందా?'' ''అవును మరి నా అన్నాన్ని అన్నకెందుకిచ్చావు'' రాజీ ఎదురుప్రశ్న. ఏమని జవాబిస్తుంది నిజానికి తన జీవితమే ఓ ప్రశ్న. ఈ పసిడి కూడా తన్ను ప్రశ్నిస్తోంది. ఆంతా నా దురదృష్టం. దానికి ఏదో ఒకటి చెప్పాలి. "అన్నయ్య స్కూలుకెళతాడుగా వాడి కక్కడ ఆకలవుతుంది. నీకు అన్నంచేసిపెడ్తానుగా'' అనేసరికి తృప్తిగా చూసింది రాజి.

వంటగదిలో కెళ్ళిన కావేరి ''అసలు ఇంట్లో బియ్యం ఉన్నాయా ఆ పసిదానికైతే వండిపెడతానంది.'' తనలోనే అనుకుంటూ రెండు డబ్బుల్ని తీసుకుని చేటలోకి బోర్లించింది. అక్షింతల్లో రెండు పిడికిళ్ళ బియ్యపుగింజలు కిందికి రాలాయి. మరోసారి డబ్బాల్ని కుదిపింది ఫలితం శూన్యం. ఏదో జ్ఞప్తికి వచ్చినట్లు గబగబా దేవుడి గూడు వద్దకెళ్ళి అక్కడి దేవుడి ఫోటోల్ని పక్కకు తొలిగించి అడుగు భాగాన్ని చిన్న గుడ్డతో మరో చేటలోకి ఊడ్చి చెరగడం ప్రారంభించింది చివరకు అందులో మరో పిడికెడు అక్షింతలు మిగిలాయి,

రాజి ఆవురావురుమంటూ పచ్చడి కలుపుకుని తింటోంది. అన్నం రంగులు రంగులు ఉన్నా, ఏమిటే ఇలా ఉంది అని అడగకుండానే. అడగదు. పసిడిదానికవసరం లేదు. ముందు తన ఆకలి తీరాలి. అంతే మరి ఆకలి అలాంటిది ఆలోచన లేనిది రుచెరగనిది.

* * *

మధ్యాహ్నం ఒంటిగంటయింది!

స్కూలునుండి సూరిగాడు వస్తూనే ''అమ్మా ఆకలిగా ఉంది అన్నంపెట్టవే" అంటూ పుస్తకాల సంచిని వీపుమీది నుంచి దించేసి బాత్రూంలో వెళ్ళి ముఖం కడుక్కుని వంట గదిలో కూర్చున్నాడు. చూస్తూనే తెలుస్తోంది వాడెంత ఆకలితో వచ్చాడో అనేది. కంచంలో అన్నం వేసి వాడి ముందుంచింది. పచ్చడి కలుపుకుంటూ వేగంగా తింటున్నాడు. మధ్యలో "ఏంటమ్మా అన్నం రంగులు రంగులుందేం'' అడిగాడు సందేహంగా. ''ఏం బాగోలేదా'' అంది కావేరి "బాగానే ఉంది ఇంకాస్త పెట్టవే" అన్నాడు. గిన్నెలో ఉన్న ఆ కాస్త మెతుకుల్ని ఊడ్చేసి పెట్టింది. 'వాడి ఆకలిని చూస్తే ఇంకా అడిగేట్టున్నాడు" అనుకుంది తనలో. కాని వాడికదే సరిపోయినట్టుంది కడుక్కుని లేచాడు.

మళ్ళీ స్కూలు కెళుతూ ''అమ్మా నోట్సులు లేవు హోంవర్క్ చేయలేదని టీచర్ బెంచీ ఎక్కించింది. డబ్బులిస్తే కొనుక్కుంటాను'' అడిగాడు అమాయకంగా దీనవదనంతో. వాడి మాటల్లో ధ్వనించిన బాధను అర్థం చేసుకున్న కావేరి—

''సాయంకాలం నాన్నొచ్చిం తరువాత ఇప్పిస్తాలే ఈ పూట స్కూలుకెళ్ళు'' అంది సర్ధిచెప్పే ధోరణిలో. ఆ మాటలకు—

''నాన్నెప్పుడూ డబ్బులు లేవంటాడుగా. అసలింట్లోకే సరుకులు తేడు నాకు నోట్సులెలా తెస్తాడు'' అంటూ తిరుగు ప్రశ్న వేశాడు సూరి.

''సూరి నే చెబుతున్నాగా ఇప్పిస్తానని'' అంది వాడికి నమ్మకం కలిగించేట్టుగా. సమాధానపడి వెళ్ళిపోయాడు సూరి.

కావేరి కడుపులో మండినట్లయింది. ఒక్కసారి పేగులు పడి అరిగినట్లయి. 'కళ్ళు తిరిగి పడిపోతానేమో' అనుకుని గోడ ఆసరాతో అలాగే వంటింట్లోకి నడిచి ఆత్రుతగా చెంబెడు మంచినీళ్ళు కడుపులో నింపుకుంది. అప్పటికామే కడుపునిండా తిని రెండ్రోజులైంది. కాస్త తేరుకుని ముందు గదిలోకి వచ్చి అలాగే చాపపై పడుకుంది నీరసంగా. అమెకు తెలీకుండానే నిద్రపట్టిందలాగే.

* * *

సాయంకాలం అయిదు గంటలు!

బాత్రూం పక్కగా అంట్లు తోముతున్న కావేరికి ఎవరో వచ్చినట్లు అలికిడి కావడంతో చేతులు కడుక్కుని ముందు

'క థా ం జ లి' జన్మదిన సంచికకు మా శుభాకాంక్షలు :

## కా వ లె ను

మా ఫాక్టరీలో తయారైన జంకాళాలు మరియు బెడ్‌షీట్లు సిల్కు జంకాళాలు. నూలు జంకాళాలు, హాలు జంకాళాలు, డైనింగ్‌హాలు జంకాళాలు ప్రసిద్ధి చెందినవి. వాటిని ప్రతివారూ మెచ్చుకుంటున్నారు. వీటికి ప్రతినిధిగా నున్నవారు మంచి లాభము పొందుచున్నారు.

ఎల్. ఐ. సి. ఏజంటు, రిటైరయిన గవర్నమెంటు పనివారి నుంచి, వారు మంచి లాభం పొందుటకు దరఖాస్తులు కోరబడుచున్నాము.

1958 లో స్థాపించి రజతోత్సవం జరుపుకొన్న సంస్థ.

—: తయారించువారు :—

Phone : 2069

**J. P. M. Textiles**

Post Box No. 60 BHAVANI - 638 301.

గదిలోకి వచ్చింది. ఎదురుగా తన భర్త ప్రకాష్. నాలుగు రోజుల తరువాత ఇంటికి రావడం ఇప్పుడే. పెరిగిన గడ్డం, పీక్కుపోయిన ముఖం, నలిగిన గుడ్డలు తైలసంస్కారం లేని తల అతన్ని ఆ విధంగా చూస్తూంటే ఏదో అనుమానంతో బయటికొచ్చి వాకిట్లో చూసింది. అంతే! ఒక్క క్షణం కావేరి గుండె ఆగినంత పనయింది. స్కూటర్ లేదు.

'స్కూటరేమయిందండీ' అడిగింది భర్తవైపు తిరిగి.

''అమ్మేశాను.''

''అమ్మేశారా'' అంది ఆశ్చర్యంగా నమ్మలేక.

''అవును అమ్మేశాను: అప్పులబాధ పడలేక అమ్మేశాను. నేటితో అప్పులు అన్నీ తీరిపోయినట్లే వెధవ స్కూటర్ పోతే పోయింది ఆఫీసుకు నడిచే వెళ్ళచ్చు'' అన్నాడు నిర్లక్ష్యంగా కుర్చీలో కూర్చుని.

"ఎంతపని చేశారండీ స్కూటర్ అమ్మేశారా ఆ స్కూటర్ కోసమేనండి మా నాన్న ఇంటిని సైతం కుదవ బెట్టి వడ్డీలకు అప్పులుచేసి ఇచ్చారు. మీరేమో అమ్మేశారు.'

'అప్పులు! అప్పులు!! ఎవరికోసం చేశారండీ పెళ్ళాం పిల్లల్ని పోషించడానికా, మీ తాగుడుకే కదా! మీ తాగుడికి మీ జీతం మొత్తం సరిపోక అప్పులు చేశారు.

అసలు మీరు ఇంట్లోకి సరకులు తేక ఎన్నాళ్ళయింది. పుస్తకాలులేక స్కూల్లో బెంచీలు ఎక్కుతున్న సూరిగాడి కోసమా, చిరిగిన బట్టలతో వున్న రాజి కోసమా? ఎందు కోసం చేశారండీ అప్పులు. ఇంట్లో పెళ్ళాం బిడ్డలు ఆకలితో వస్తున్నారా. బ్రతుకున్నారా అనేదైనా మీకు గుర్తుందా. ఆ మాత్రం ఇంకిత జ్ఞానంకూడా లేని మీకు భార్యనైనందుకు సిగ్గుపడుతున్నాను' ఆవేశంలో కావేరి ఇంకా ఏమేమో మాట్లాడుతోంది.

కావేరి మాటలు ఈటెల్లా గుండెల్లో గుచ్చుకుంటున్నాయి. అవి తనను అవమానించడానికేనని మగవాడినన్న అహంకారంతో-'కావేరి నోర్మూస్తావా లేదా ఇంకొక్క మాటన్నావంటే నేనేం చేస్తానో నాకే తెలియదు' అన్నాడు గట్టిగా అరుస్తూ హెచ్చరిస్తున్నట్లుగా.

"ఏంచేస్తారండీ! కొడతారు కాకపోతే చంపేస్తారు. అంతకన్నా ఏంచేయగలరు మగాడివిగా" అంది కోపాన్ని ఆపుకోలేక.

"అంతే! ప్రకాష్ తనుకూర్చున్న చోటునుండి మెరుపు వేగంతో లేచి కావేరి వెంట్రుకల్ని పట్టుకుని ఈడ్చాడు. కిందపడిపోయిన కావేరిని అందిన చోటల్లా చేతుల్తో కొడుతున్నాడు. కోపాన్ని ఆపుకోలేక కాలితో కావేరి డొక్కలో బలంగా తన్నాడు. ఆ దెబ్బకు తట్టుకోలేక 'అమ్మా'అంటు బాధగా దగ్గిరికి ఉండచుట్టుకునిపోయి మూల్గుతూ 'ఏమండీ కొట్టొద్దండి ప్లీజ్!' అంది వేడుకుంటూ.

ఆ మాటలకు మరింత రెచ్చిపోయిన ప్రకాష్‌లో పైశాచికత్వం పరకాష్ఠకు చేరుకుని నడుముకున్న బెల్టును లాగి ఆమె శరీరంపై నాట్యం చేస్తున్నాడు రాక్షసంగా. స్పృహ

With Best Compliments From :

మా ప్రత్యేక తయారింపులు :—

- 100% ఫైన్
- జనత ఫైన్
- రాకెట్ ఇంటర్‌లాక్
- 100% రిబ్ బ్రీఫ్స్
- పాయల్ ఫైన్
- ట్రంక్స్
- మమతా ఫైన్

IS : 4964-80

R.K.S. KNITTINGS TIRUPUR

Trade Mark
Regd. No. 342215

Phone : 22016

R. K. S. Knittings
43, Cauvery St, Odakkadu TIRUPUR-638 602.

తప్పిన కావేరిని తను అలిసిపోయేవరకు కొట్టి ఇంట్లోంచి విసురుగా వెళ్ళిపోయాడు.

ఇంట్లో జరుగుతున్న గొడవకు బయట ఆడుకుంటున్న సూరి లోపలికివచ్చి తల్లిని కొడుతున్న తండ్రిని చూస్తూ భయంగా మూలకు నిల్చుని ప్రేక్షకుడిలా చూస్తున్నాడు. తనొకసారి యిలాగే తల్లిని కొడుతున్న తండ్రికి అడ్డం వెళ్ళాడు ఏడుస్తూ. అపుడు తండ్రి తనకూ రెండంటించిన సంఘటనను గుర్తుతెచ్చుకున్నాడు వాడు. రాజీ నిద్రలేచి ఏడుస్తోంది. తండ్రి వెళ్ళింతరువాత తల్లి దగ్గరగా వెళ్ళి 'అమ్మా-అమ్మా' అంటూ తల్లిని కుదుపుతూ పిలుస్తున్నాడు సూరి.

అరగంట తర్వాత స్పృహ వచ్చిన కావేరి మెల్లగాలేచి కూర్చోవాలని ప్రయత్నించింది, శక్తి చాలడంలేదు. శరీరమంతా పచ్చి పుండులావుంది. ఎలాగో బలాన్నంతా కూడదీసుకుని లేచి బాత్రూంలో ముఖం కడుక్కుంది.

వచ్చి అలాగే కూర్చుండిపోయింది నీరసంగా. తల్లి కిరువైపులా కూర్చున్నారు రాజి, సూరి. అలాగే గోడ నానరాగా కూర్చున్న కావేరి కళ్ళవెంట తనకు తెలీకుండా కన్నీళ్లు కారుతున్నాయి. అమాయకంగా ఆమెవైపు చూస్తూన్నారా పిల్లలు.

ఇంతలో సూరి తల్లితో 'అమ్మా నాన్నను చంపేద్దాం' అన్నాడు అప్రయత్నంగా.

'తప్పుబాబూ అలాంటి మాటలనొద్దమ్మా' అంది వాడి నోటికి చేయినడ్డంగా వుంచుతూ.

"మరి నాన్న నిన్ను కొడతాడెందుకు? ఇంట్లోకి సరుకులుతేడు. నాకు పుస్తకాలు తేడు. చెల్లాయికి ఫ్రాకులు తేడు చంపేస్తే ఏమవుతుంది" వత్తిపలుకుతూ అన్నాడు అమాయకంగా.

"సూరి చెబుతున్నాగా మరెప్పుడలా మాట్లాడొద్దు తప్పమ్మా" అంటూ వాడికి సర్దిచెప్పి మెళ్ళోని మంగళ సూత్రాల కళ్ళకద్దుకుంది. సూరిగాడు మౌనంగా ఉండిపోయాడు.

కావేరి కెందుకోగాని సూరిగాడి మాటలే చెవుల్లో మారుమ్రోగుతున్నాయి 'అమ్మా నాన్నను చంపేద్దాం! అమ్మా నాన్నను చంపేద్దాం!!' అవును చంపేస్తే ఏమవుతుంది? బ్రతికి ఎవర్ని ఉద్ధరిస్తున్నాడు. పెళ్లాం, బిడ్డల్ని సైతం మరచి తప్పతాగుతున్నాడే తప్ప అలాంటి వాడిని చంపితే ఏమవుతుంది.

ఈ చిత్రహింస నేనిక భరించలేను. నాలో సహనం చచ్చింది. అందుకే ఆయన్ను చంపాలి నన్ను నా పిల్లల్ని రక్షించుకోడానికి. కాని ఎలా...ఎలా...ఎలా...మెడలోని మంగళ సూత్రాల్ని చేతుల్లోకి తిసుకుని 'ఈ పసుపుతాడు

With Best Compliments From :




మేలైన పొగాకుతో, అత్యుత్తమమైన
ఆకులతో, నిపుణులైన పనివారలచే
తయారు చేస్తున్నాము

★

మల్లిస్సేరి బీడీలు

★

అత్యుత్తమమైనదని లక్షలాది
ప్రజలు వాడుతున్నారు,

Grms : " Mallisseri Phone : 24031

**Malliseri Beedi Works**

SULLIVAN STREET : : COIMBATORE-641 001.

తానే నా మెడలోవేసి పసుపుతాడు చేశావు. దీనితోనే నిన్ను చంపుతాను' మనసులో అనుకుని ఓ నిర్ణయానికి వచ్చింది కావేరి. పిల్లలిద్దరూ ఆకలిని మరచి నిదురపోతున్నారు. జాలిగా వారివైపుచూసి ఇంటికి తాళంవేసి బజారువైపు నడిచింది.

మెడలోని మంగళసూత్రాలు కంసలిచేతికిచ్చి నాల్గు వందలు తీసుకుంది. బార్‌లో కౌంటర్ దగ్గర కుర్రవాడితో మాట్లాడి తనక్కావలసినది ప్యాక్ చేయించుకుని ఇల్లు చేరుకుంది. అప్పటికి ఆకాశంనిండా మబ్బులు అలుముకుని వర్షం వస్తుందని సూచిస్తున్నాయి.

ప్యాక్‌లోంచి మూడు రకాలైన మద్యం సీసాల్ని తీసి ఎదురుగా ఉన్న టేబుల్‌పై ఉంచింది. చిన్నగా చినుకులు ప్రారంభమై జోరుగా వర్షం కురుస్తోంది.

X X X

రాత్రి పదకొండున్నర దాటింది!

తలుపు తట్టిన శబ్దం. లేచి తెరిచింది. ఎదురుగా ప్రకాష్. గుప్పుగా భరించలేని వాసన. తాగొచ్చాడు. విసురుగా ఆమెను తప్పుకుని లోపలికివచ్చి కుర్చీపైని టవల్‌తో తుడుచుకుంటూ టేబుల్‌పైని సీసాల్ని చూసి "కావేరి ఇవి ఇక్కడికి—" ''నేను తెచ్చాను మీకోసమే' అంది నెమ్మదిగా. అంతే ఓ సీసాను తీసుకుని మూత తీసేసి ఏకంగా సీసానే నోటికి పట్టించాడు. అరగంటలోగా రెండు బాటిల్స్ ఖాళీచేశాడు. వళ్ళు తెలీని స్థితిలో మైకంలో ఏమేమో వాగుతున్నాడు.

''కావేరి డియర్ నువ్వు చాలా మంచిదానివి. నేనంటే నీకెంత ప్రేమో కదూ! అందుకే నువ్వంటే నాకు చాలా లవ్వు''...

గంటలోగా సీసాల్ని పూర్తిగా ఖాళీచేసి ఒళ్లుతెలీకుండా పడిపోయాడు ప్రకాష్ బయట వర్షం కురుస్తూనే ఉంది.

తలుపులు తెరచి బయటికిచూసింది కావేరి. కుండపోతగా వర్షం కురుస్తోంది. రోడ్లపై మోకాపైగా నీరు పారుతోంది. ఇప్పట్లో తగ్గేట్లులేదు. అంతే—తన నిర్ణయాన్ని అమలుపరచడానికిదే అనువైన సమయమని తప్ప తాగి పడిపోయిన భర్తని తన శక్తికొలది నిలుచోబెట్టి అతని కుడిచేతిని తన భుజాలమీద ఆసరాగా పట్టుకుని అతికష్టంగా బయటికి నడిచివెళుతూ 'భగవాన్ ఈ ప్రపంచంలో ఏ స్త్రీ చేయని సాహసం నేను చేస్తున్నాను. ఇది తప్పో ఒప్పో నాకు తెలీదు. ఏదైనా నా పరిస్థితిని అర్థం చేసుకో' అనుకుంటూ రోడ్డుపైకి ప్రకాష్‌ను తీసుకు వచ్చింది. వర్షం కురుస్తూనేవుంది.

రోడ్డుపై నీరు వేగంగా పారుతోంది. ప్రకాష్‌ను నీళ్ళలోకి త్రోసింది. దుంగలా పడిపోయాడు. ప్రకాష్ దేహం నీళ్ళలో కనబడటంలేదు. అతని శరీరాన్ని ముంచుతూ వర్షపునీరు పారుతోంది.

కావేరి వేగంగా ఇంట్లో తలుపులు వేసుకుంది. వర్షం ఇంతకింతకూ ఎక్కువవుతోంది. మరునాడుదయం తన భర్త మరణిస్తే తాగి చచ్చాడనుకుంటారు. లేకపోతే తాగి పడిపోయాడంటారు. బ్రతికితే మళ్ళీ తను ఎప్పటిలా బాధలు, చిత్రహింసలు అనుభవించక తప్పదు.

'ఏది ఏమైనా సహనంచస్తే తిరుగబడక తప్పదు.' అనుకుంటూ రేపటి ఉదయంకోసం ఎదురుచూస్తూ కూర్చుండిపోయింది కావేరి. *

With Best Compliments From :



SARADA BANIANS
SARADA KNITTING MILLS
TIRUPUR-638 602.
Phone: 23243, 26989